తెలివిగా పని చేయాలి..

బానిసలా కాదు

- ఎల్‌అండ్‌టీ చైర్మన్‌కు హర్ష్ గోయెంకా కౌంటర్
- వారంలో 90 గంటలు పని చేయాలన్న సుబ్రహ్మణ్యన్
- సీనియర్ వ్యక్తి ఇలా మాట్లాడటమా: దీపికా

న్యూఢిల్లీ, జనవరి 10: వారానికి 90 గంటలు పని చేయాలని, ఆదివారాలు సైతం ఆఫీసుకు రావాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు సైతం సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. తెలివిగా పని చేయాలని, బానిసగా కాదని ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా వ్యాఖ్యానించారు. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'వారానికి 90 గంటల పనా? సన్‌డేను సన్-డ్యూటీగా పేరు మార్చి, డేఆఫ్ అనే దానిని కల్పిత ఆలోచన చేద్దామా?' అంటూ ఆయన మండిపడ్డారు. 'కష్టపడటంతో పాటు తెలివిగా పని చేయాలని నేను నమ్ము తాను. కానీ, జీవితాన్ని ఆఫీస్ షిఫ్ట్‌గా మార్చడం విజయానికి కాకుండా అలసటకు కారణమవుతుంది. పని-జీవన సమతుల్యం అనేది ఐచ్ఛికం కాదు.. అవసరం. తెలివిగా పని చేయండి. బానిసలా కాదు' అని ఆయన పేర్కొన్నారు.

ఎల్‌అండ్‌టీ వివరణపైనా విమర్శలు

'సీనియర్ స్థాయిల్లో ఉండే ఇలాంటి వ్యక్తి ఈ వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగించింది' అని నటి దీపికా పడుకోన్ వ్యాఖ్యానించారు. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై విమర్శల నేపథ్యంలో వివరణ ఇస్తూ ఎల్‌అండ్‌టీ ఒక ప్రకటన ఇచ్చింది. 'ఈ దశాబ్దం భారత్‌దేనని, అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు సమష్టి కృషి అవసరమనేది మేము నమ్ముతున్నాం. మా చైర్మన్ వ్యాఖ్యలు ఈ గొప్ప లక్ష్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి' అని పేర్కొన్నది. ఈ వివరణపైనా విమర్శలొచ్చాయి. ఈ వివరణపై మరోసారి స్పందించిన దీపికా.. 'వీరు మరింత దిగజార్చారు' అని కామెంట్ చేశారు.

ఇంజినీర్ల కొలువులపై ఏఐ దెబ్బ

- ఈ ఏడాది కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టబోమని సేల్స్‌ఫోర్స్ కంపెనీ ప్రకటన
- గ్లోబల్ బ్యాంకుల్లో 2 లక్షల జాబ్‌ల వరకు కోత
- బ్లూమ్‌బర్గ్ ఇంటెలిజెన్స్ తన నివేదికలో వెల్లడి



శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 10: అనుకున్నదే జరుగుతున్నది. కృత్రిమ మేధ(ఏఐ) రాకతో ఇంజినీర్ల కొలువులకు కష్టమే అనే ఆందోళనలు నిజమవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు రాయాల్సిన కోడింగ్‌ను ఏఐ రాసి పెడుతున్నది. దీంతో ఏఐ వినియోగాన్ని పెంచుతున్న సంస్థలు ఇంజినీర్ల సంఖ్యను తగ్గిస్తున్నాయి. ఈ దిశగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా పని చేసే సేల్స్‌ఫోర్స్ సంస్థ చేసిన ప్రకటన ఇంజినీర్లను కలవరపాటుకు గురి చేస్తున్నది. ఈ ఏడాది తమ సంస్థలో కొత్తగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నియమించుకోబోమని ఈ సంస్థ సీఈఓ మార్క్ బెనియాఫ్ ప్రకటించారు. తమ సంస్థకు చెందిన ఏఐ సాంకేతికత 'ఏజెంట్‌ఫోర్స్'తో ఉత్పాదకత పెరిగిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. ఇదే సమయంలో తమ ఏఐ ఆధారిత ఉత్పత్తుల ప్రయోజనాలను వివరించి, సేల్స్ పెంచడం కోసం వెయ్యి నుంచి రెండు వేల మంది కొత్త సేల్స్ ఉద్యోగులను నియమించనున్నట్టు తెలిపారు.

బ్యాంకు కొలువులపైనా ప్రభావం

ఏఐ కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల కొలువులే కాకుండా బ్యాంకు ఉద్యోగాలనూ దెబ్బకొట్టనున్నట్టు బ్లూమ్‌బర్గ్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. సిటిగ్రూప్, జేపీమార్గన్, గోల్డ్‌మాన్ శాక్స్ వంటి ప్రముఖ గ్లోబల్ బ్యాంకుల్లో 93 మంది చీఫ్ ఐటీ ఆఫీసర్లను సర్వే చేసి రూపొందించిన ఈ నివేదికను గురువారం విడుదల చేసింది. అంతర్జాతీయ బ్యాంకుల్లో కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్నందున రానున్న మూడు నుంచి ఐదేండ్లలో దాదాపు 2 లక్షల ఉద్యోగాలు తొలగించే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ పేర్కొన్నది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 3 శాతం ఉద్యోగులు తగ్గొచ్చని తెలిపింది. మొత్తం ఉద్యోగుల్లో 5 నుంచి 10 శాతం తగ్గొచ్చని సర్వేలో పాల్గొన్న వారిలో నాలుగో వంతు మంది అభిప్రాయపడ్డారు. ఏఐ బోట్లు వినియోగదారులకు సేవలు అందించడం పెరుగుతుందని, దీంతో బ్యాక్ ఆఫీస్, మిడిల్ ఆఫీస్, ఆపరేషన్స్‌లో ఉద్యోగాలు చేసేవారికి ముప్పు ఎక్కువగా ఉందని బీఐ సీనియర్ అనలిస్ట్ థామస్ నోయెట్‌జెల్ తెలిపారు. రోజూ ఒకేరకమైన పనులు చేసే వారి ఉద్యోగాలు పోతాయని తెలిపారు.

మూడు రంగాల ఉద్యోగాలే సేఫ్: బిల్ గేట్స్

ఏఐ ప్రభావం పెరిగినప్పటికీ మూడు రంగాల ఉద్యోగాలకు మాత్రం ఎలాంటి ముప్పు ఉండదని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. ఇంధన, జీవసాంకేతికత, ఏఐ అభివృద్ధిలోని ఉద్యోగాలకు ఎలాంటి నష్టం ఉండదని ఇటీవల జరిగిన ఓ సదస్సులో ఆయన తెలిపారు. అయితే, ఏఐను ఆయన సమర్థించారు. 'పని గంటలను తగ్గించి, సృజనాత్మక ఆలోచనలు చేసేందుకు ఏఐ మనకు అవకాశం కల్పిస్తుంది. ఏఐ వేగంగా పురోగతి చెందుతున్నది. ఏఐ నైపుణ్యాలు కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు, ఏఐతో 9.2 కోట్ల ఉద్యోగాలు పోతాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం తాజా నివేదికలో వెల్లడించింది.

బంగారం, నగదు, 3 మొసళ్లు

బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ సోదాలు

అవాక్కైన ఐటీ అధికారులు

సాగర్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఓ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులకు భారీగా బంగారం, నగదుతో పాటు మూడు మొసళ్లు కనిపించడం షాక్ కలిగించింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే హర్‌వంశ్ సింగ్ రాథోడ్ బీడీల వ్యాపారంలో చట్ట విరుద్ధ లావాదేవీలకు పాల్పడ్డారని ఫిర్యాదు రావడంతో ఈ నెల 5 నుంచి ఐటీ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. రాథోడ్ రూ.140 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడినట్టు గుర్తించారు. రాథోడ్ వ్యాపార భాగస్వామి రాజేశ్ నివాసంలోనూ సోదాలు జరిగాయి.

ఫేక్ సుప్రీంకోర్టు వెబ్‌సైట్లతో జాగ్రత్త

న్యూఢిల్లీ: తన అధికారిక పోర్టల్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకురావడంతో సుప్రీంకోర్టు ప్రజలను హెచ్చరించింది. సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ (టెక్నాలజీ) హర్‌గుర్వరిందర్ సింగ్ జగ్గీ ఈ మేరకు ఓ ప్రకటనలో హెచ్చరించారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉందని, ప్రజల సున్నితమైన సమాచారాన్ని అక్రమంగా రాబట్టుకోవడం కోసం మోసగాళ్లు ఆ నమ్మకాన్ని ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. www.scigoin.com, అదే విధంగా judiciarycheck.in వంటి యూఆర్ఎల్స్‌తో ప్రజలను మోసగిస్తున్నారని తెలిపారు. ఇవి ఫేక్ వెబ్‌సైట్లని చెప్పారు. సుప్రీంకోర్టు అధికారిక డొమైన్ www.sci.gov.in అని తెలిపారు.

ఇకపై ప్రజలు సుప్రీంకోర్టును సందర్శించొచ్చు

న్యూఢిల్లీ: సామాన్య ప్రజలు సుప్రీంకోర్టును సందర్శించేందుకు అవకాశం వచ్చింది. ప్రతి నెలా ఒకటో, మూడో శనివారాల్లో ప్రజలు సుప్రీంకోర్టును సందర్శించవచ్చు. అయితే, ఆ రోజుల్లో ప్రభుత్వ సెలవులు ఉంటే ఈ అవకాశం ఉండదు. ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు సుప్రీంకోర్టు పట్ల వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ భవనంలోని ప్రతి విభాగం గురించి, దాని చారిత్రక విశిష్టత గురించి అధికారులు తెలియజేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తీసుకెళ్లి, చూపిస్తారని తెలిపారు. ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం తప్పనిసరి.

కొత్త ఏడాదిలోనూ కోతలే!

- భారీగా లేఆఫ్స్ ప్రకటిస్తున్న కంపెనీలు
- జాబితాలో మైక్రోసాఫ్ట్, అమెజాన్, బోయింగ్, వాషింగ్టన్ పోస్ట్ సంస్థలు
- ఏఐ రాక, ఖర్చులు తగ్గించుకోవడానికే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ (ఏఐ) రాక, ఖర్చులను తగ్గించుకోవాలన్న ఉద్దేశం, మాంద్యం భయాలు వెరసి కొత్త ఏడాదిలోనూ కొలువుల కోత కొనసాగుతున్నది. రానున్న ఐదేండ్లలో తమ ఉద్యోగులను పెద్దమొత్తంలో తొలగించనున్నట్టు 41 శాతం కంపెనీలు పేర్కొన్నట్టు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ఓ నివేదికలో వెల్లడించింది. ప్రధాన రంగాల్లోకి ఏఐ ప్రవేశించడమే దీనికి కారణంగా వివరించింది. కాగా, 2025లోనూ ఉద్యోగాల కోత ఉంటుందని ఇప్పటికే పలు సంస్థలు ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్నది. ఐటీ, మీడియా, ఫైనాన్స్, తయారీ, రిటైల్ తదితర రంగాల్లో ఉద్యోగుల తొలగింపు ఎక్కువగా ఉండనున్నట్టు నివేదికలు చెప్తున్నాయి.

మైక్రోసాఫ్ట్ (సాఫ్ట్‌వేర్): కొత్త నైపుణ్యాలను ప్రదర్శించని ఉద్యోగులను తొలగించనున్నట్టు ప్రకటించింది. 2,28,000 మంది సంస్థలో పనిచేస్తుండగా 1 శాతం మందిని ఇంటికి పంపించనున్నట్టు వెల్లడించింది.

అమెజాన్ (ఈ-కామర్స్): మేనేజ్‌మెంట్ స్థాయిల్లోని 14 వేల మందిని తొలగించనున్నట్టు ప్రకటించింది. ఏఐ టూల్స్ వినియోగాన్ని పెంచనున్నట్టు తెలిపింది. బోయింగ్, స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కూడా తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించనున్నట్టు ప్రకటించాయి.

బ్లాక్‌రాక్ (ఇన్వెస్ట్‌మెంట్): వ్యూహాత్మక కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని 200 మందికి పింక్ స్లిప్ ఇవ్వనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఏఐతో ఆ స్థానాలను భర్తీ చేయనున్నట్టు తెలిపింది.

బ్రిడ్జ్‌వాటర్ (ఇన్వెస్ట్‌మెంట్): పొదుపు చర్యల్లో భాగంగా మొత్తం స్టాఫ్‌లో 7 శాతం మందిని తొలగించనున్నట్టు ప్రకటించింది.

వాషింగ్టన్ పోస్ట్ (మీడియా): కరోనా సంక్షోభం కారణంగా ఖర్చులతో పాటు నష్టాలను తగ్గించుకోవడానికి తమ స్టాఫ్‌లో 4 శాతం మందిని తొలగిస్తున్నది.

అసోసియేటెడ్ పోస్ట్ (మీడియా): నష్టాలను తగ్గించుకోవడానికి 8 శాతం మందిని తొలగించనున్నట్టు ప్రకటించింది.

యాలీ (ఫైనాన్స్): తమ సంస్థలోని మొత్తం 11 వేల మంది ఉద్యోగుల్లో 500 మందిని తొలగించనున్నట్టు ప్రకటించింది. కంపెనీ భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలోఉంచుకొని ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆశావహులకు ఊరట

నవంబర్ 5-18 మధ్య డ్రాపౌట్ అయినవారికి సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆశావహులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2024 నవంబర్ 5-18 మధ్య తమ కోర్సులను వదులుకున్న ఆశావహులు జేఈఈ-అడ్వాన్స్‌డ్ కోసం నమోదు చేసుకునేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతించింది. ఆశావహులకు ఇచ్చిన అవకాశాలను మూడు నుంచి రెండుకు తగ్గించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపింది. జేఈఈ-అడ్వాన్స్‌డ్ రాసేందుకు 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలలో 12వ తరగతి పరీక్షకు హాజరైన వారు అర్హులని పేర్కొంటూ 2024 నవంబర్ 5న జాయింట్ అడ్మిషన్ బోర్డు(జేఏబీ) ఓ ప్రకటనను జారీచేసిందని సుప్రీంకోర్టు తెలిపింది. ఆ నిర్ణయంలోని మంచిచెడ్డల గురించి తాము లోతుగా వెళ్లదలచుకోలేదని తెలిపింది.

కార్చిచ్చులకు 10 వేల నిర్మాణాలు ఆహుతి

- లాస్ ఏంజెల్స్‌లో 10కి పెరిగిన దావానల మృతుల సంఖ్య
- ఇదే అదనుగా సంపన్నుల ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగలు

లాస్ ఏంజెల్స్: అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో చెలరేగిన రెండు కార్చిచ్చుల ధాటికి ఇప్పటి వరకు 10 మంది చనిపోయారని, 10 వేల నిర్మాణాలు దగ్ధమయ్యాయని అధికారులు గురువారం తెలిపారు. కొత్త కార్చిచ్చు వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో మరింత మంది ప్రజలు అక్కడి నుంచి తరలి వెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. సాన్ ఫెర్నాండో లోయలో మధ్యాహ్నం ప్రారంభమైన కొత్త కెన్నెత్ దావానలం సాయంత్రానికి పక్కనున్న వెంచురా కౌంటీకి వ్యాపించిందని వెల్లడించారు. బలమైన గాలులు తోడు కావడం వల్ల మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయని, శుక్రవారం ఉదయానికి ఇవి మరింత బలపడొచ్చని లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బస్స్ తెలిపారు. కెన్నెత్ కార్చిచ్చుకు కారణమని భావిస్తున్న నిరాశ్రయుడిని పోలీసులు గురువారం అదుపులోనికి తీసుకున్నారు. మరోవైపు కార్చిచ్చు కారణంగా ఖాళీ అయిన సంపన్నుల ఇండ్లను దోచుకోవడానికి దొంగలు ఎగబడుతున్నారు. ఇప్పటికే 20 మంది దొంగలను అరెస్ట్ చేశారు.

నేనూ మనిషినే.. దేవుడిని కాదు

- పొరపాట్లు చేసి ఉండొచ్చు.. దురుద్దేశంతో చేయను
- సాధారణ విద్యార్థినే.. పరీక్షలంటే పారిపోయేవాడిని
- ఎప్పుడూ కంఫర్ట్ జోన్‌లో జీవించలేదు
- మొదటి పాడ్‌కాస్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 10: తానూ మనిషినేనని.. దేవుడిని కాదని, పొరపాట్లు చేసి ఉండొచ్చు కానీ దురుద్దేశంతో మాత్రం తప్పులు చేయనని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జెరోడా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌తో మోదీ మొదటి పాడ్‌కాస్ట్ శుక్రవారం విడుదలైంది. ఇందులో తన బాల్యం, రాజకీయ జీవితం, అనుభవాల గురించి మోదీ మాట్లాడారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా గతంలో తాను చేసిన వ్యాఖ్యల గురించి మోదీ స్పందిస్తూ.. 'నేను సున్నితంగా మాట్లాడలేదు. తప్పులు జరుగుతాయి. నేనూ మనిషినే, దేవుడిని కాదు' అని అన్నారు. గోద్రా ఘటనలో మృత దేహాలు చూసి చాలా భావోద్వేగానికి గురయ్యానని, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నందుకు అదుపు చేసుకున్నట్టు చెప్పారు. తనకు అమెరికా వీసా ఇచ్చేందుకు నిరాకరించడం దేశానికి, ఎన్నికైన ప్రభుత్వానికి అవమానంగా భావించానని గుర్తుచేసుకున్నారు.

ప్రపంచం మనల్ని విశ్వసిస్తోంది..

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలపై స్పందిస్తూ.. 'మనలో ద్వంద్వ నీతి లేనందున ప్రపంచం మనల్ని విశ్వసిస్తోంది. శాంతి వైపు, తటస్థంగా మేము ఉంటామనే మాట రష్యా, ఉక్రెయిన్, ఇరాన్, పాలస్తీనా, ఇజ్రాయెల్‌లో చెప్పాను. వారికి నాపై నమ్మకం ఉంది.' అని వ్యాఖ్యానించారు. గాంధీ, సావర్కర్ గురించి మాట్లాడుతూ.. వారిద్దరి దారులు వేరైనా, భావజాలం మాత్రం స్వాతంత్ర్యాన్ని సాధించడమేనని చెప్పారు. 'దేశమే ప్రధానం' అనేదే రాజకీయాల్లో తన భావజాలమని తెలిపారు.

కష్టాలే నాకు విశ్వవిద్యాలయం

తానెప్పుడూ కంఫర్ట్ జోన్‌లో జీవించలేదని, ప్రమాదాన్ని ఎదుర్కొనే సామర్థ్యం తనలో ఎక్కువ ఉంటుందని, ఇంతవరకు దానిని పూర్తిగా వినియోగించలేదని చెప్పారు. చిన్నప్పుడు తాను సాధారణ విద్యార్థినేనని, పరీక్షలంటే పారిపోయే వాడినని, ఎలాగోలా పాస్ అయ్యేవాడినని చెప్పారు. యుక్త వయసులోనే ఇల్లు వదిలేశానని, తన వారందరితోనూ సంబంధాలు కోల్పోయానన్నారు.

ట్రంప్ దోషే.. కానీ శిక్ష లేదు

జైలు, జరిమానా విధించని కోర్టు

దోషిగా తేలిన తొలి అధ్యక్షుడు

న్యూయార్క్, జనవరి 10: పోర్న్ స్టార్‌కు అక్రమంగా నగదు చెల్లించాడనే ఆరోపణల్లో అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషిగా తేలినా శిక్ష మాత్రం పడలేదు. ఈ కేసులో ఇప్పటికే ట్రంప్‌పై అభియోగాలు నిరూపితమయ్యాయి. న్యూయార్క్ జడ్జి జువాన్ మెర్చాన్ శుక్రవారం తుది తీర్పు ఇచ్చారు. ట్రంప్‌ను దోషిగా పేర్కొన్న న్యాయమూర్తి.. జైలుశిక్ష, జరిమానా విధించలేదు. ఈ మేరకు 'అన్‌కండీషనల్ డిశ్చార్జ్' చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కేసులో దోషులకు నాలుగేండ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. అయితే, అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన వ్యక్తికి చట్టానికి అతీతంగా ఉండే న్యాయపరమైన రక్షణ కారణంగా ట్రంప్‌కు శిక్ష విధించలేదు. తనకు ఎలాగూ శిక్ష పడదనే కారణంతో ట్రంప్ కోర్టుకు కూడా హాజరుకాలేదు. కాగా, ఒక కేసులో దోషిగా తేలి అమెరికా అధ్యక్షుడు కాబోతున్న మొదటి వ్యక్తిగా డొనాల్డ్ ట్రంప్ నిలవనున్నారు.

అంతరిక్షంలో సౌర ఆనకట్ట

సోలార్ ఎనర్జీ కోసం చైనా భారీ ప్రాజెక్టు

బీజింగ్, జనవరి 10: అంతరిక్ష, పునరుత్పాదక ఇంధన రంగంలో చైనా ఓ భారీ ప్రాజెక్టును చేపట్టబోతున్నది. రాత్రి, పగలుతో సంబంధం లేకుండా అంతరిక్షంలో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని భావిస్తున్నది. ఇందుకోసం భూమికి 32 వేల కిలోమీటర్ల ఎత్తులో భూస్థిర కక్ష్యలో కిలోమీటరు పొడవునా సౌరఫలకలను ఏర్పాటు చేయనుంది. తద్వారా నిరంతరం సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయనుంది. భూమిపై ఉన్న సౌరఫలకాలు కేవలం సూర్యరశ్మి ఉన్నప్పుడే విద్యుత్తును ఉత్పత్తి చేయగలవు. రాత్రి వేళల్లో, మేఘాలు ఉన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి కాదు. అంతరిక్షంలో నిర్మించే ఈ సౌర విద్యుత్తు కేంద్రంలో మాత్రం భూవాతావరణం, రాత్రి పగలుతో సంబంధం లేకుండా నిరంతరాయంగా విద్యుత్తును ఉత్పత్తి చేయగలదని శాస్త్రవేత్తలాంగ్‌లేహావో తెలిపారు. ఈ ప్రాజెక్టును త్రీగోర్జెస్ డ్యామ్ ఆఫ్ స్పేస్ అని పిలుస్తున్నారు.

కర్ణాటకలో మళ్లీ బీర్ల ధరల బాదుడు!

- మూడోసారి రేట్ల పెంపు
- తుది నోటిఫికేషన్ జారీ
- మందుబాబులకు కాంగ్రెస్ సర్కార్ షాక్

బెంగళూరు, జనవరి 10: కర్ణాటకలో బీర్ల రుచి చేదెక్కనుంది! వాటి ధరల పెంపునకు సంబంధించి శుక్రవారం సిద్ధరామయ్య సర్కారు తుది నోటిఫికేషన్ జారీ చేసింది. సీఎం అంతిమ నిర్ణయం తీసుకొంటే ఈ నెల 20 నుంచే ఈ ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి తిమ్మాపూర్ తెలిపారు. దీంతో ఈ సారి ధరలు పెరిగితే ఏడాది వ్యవధిలో మూడోసారి వినియోగదారులపై కాంగ్రెస్ సర్కారు ధరల భారం మోపినట్టవుతుంది. తాజా నోటిఫికేషన్ ప్రకారం ధరలు అమలైతే బీర్ల ధరలు ఏకంగా 10-20 శాతం పెరుగుతాయి. ధరలు ఇలా పెరిగితే తమ వ్యాపారాలు దెబ్బ తింటాయని, దాని ప్రభావం పర్యాటకంపైనా పడుతుందని బీర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి 2023 రాష్ట్ర బడ్జెట్‌లో బీర్ల ధరలను పది శాతం పెంచడం వల్ల 650 మి.లీ బీర్ సీసా ధర రూ.10-15 పెరిగింది. ఆ తర్వాత గతేడాది ఫిబ్రవరిలో మరోసారి ధరలు 10 శాతం పెంచడం వల్ల అదే బీర్ సీసా ధర రూ.15 పెరిగింది.

దేవుడా నువ్వే కాపాడాలి

స్వీయ రక్షణ కోసం హోమం చేశా ■ డీకే శివకుమార్ వ్యాఖ్యలు

బెంగళూరు, జనవరి 10: కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత పోరు జరుగుతున్నట్లు జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో తనను తాను రక్షించుకునేందుకు హోమం నిర్వహించానని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం బెంగళూరులోని మల్లేశ్వరంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మనశ్శాంతి, ప్రశాంతత కోసం తాను పూజలు చేస్తానని చెప్పారు. హోమాలు, యాగాలు, పూజలు చేయడం, రోజూ ఆలయాలను సందర్శించడం తనకు అలవాటని ఆయన చెప్పారు. శత్రువులను నాశనం చేయడానికి శివకుమార్ ప్రతువులు జరిపించినట్లు కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చేసిన ఆరోపణల గురించి విలేకరులు ప్రశ్నించగా తనకు మంచి జరగాలని కోరుతూ తాను రోజూ ప్రార్థనలు చేస్తానని డీకే చెప్పారు. తనను ఇబ్బంది పెట్టే వారి నుంచి రక్షణ ఇవ్వాలని ప్రార్థిస్తానని, ఇందులో దాచుకోవడానికి ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. మీరు ఇబ్బంది పెట్టినా మీ నుంచి కూడా రక్షణ కల్పించాలని ప్రార్థిస్తానని ఆయన విలేకరులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఎయిమ్స్‌లో చేరిన చోటా రాజన్

న్యూఢిల్లీ, జనవరి 10: ఢిల్లీలోని తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న మాఫియా డాన్ చోటా రాజన్ శుక్రవారం ఎయిమ్స్ దవాఖానలో చేరాడు. సైనస్ సమస్యతో బాధపడుతున్న రాజన్‌కు సర్జరీ చేయాల్సి ఉంటుందని డాక్టర్లు తెలిపినట్టు అధికారవర్గాలు చెప్పాయి. ఒకప్పుడు మాఫియా డాన్ దావూద్ ఇబ్రహింకు ప్రధాన అనుచరుడైన చోటా రాజన్‌కు 2001లో జరిగిన హోటల్ యజమాని జయా షెట్టి హత్య కేసులో 2024లో యావజ్జీవ కారాగార శిక్షను బాంబే హైకోర్టు నిలిపివేసిన తర్వాత ఇదే కేసులో రాజన్‌కు బెయిల్ లభించింది. అయితే ఇతర కేసులకు సంబంధించి జైలులో ఉండడంతో బెయిల్ లభించినా అతనికి ఊరట దక్కలేదు.

ఇరాన్ రాజధాని మార్పు!

మక్రాన్‌కు మారుస్తున్నట్టు ప్రకటన

టెహ్రాన్, జనవరి 10: తమ దేశ రాజధానిని టెహ్రాన్ నుంచి దక్షిణ తీర ప్రాంత నగరం మక్రాన్‌కు మారుస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. ఆర్థిక, పర్యావరణ సమస్యలు, అధిక జనాభా, నీటి కొరత, విద్యుత్తు కొరతల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ దేశ అధికార ప్రతినిధి మొహజెరానీ తెలిపారు. సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ కలిగిన రాజధానిని మక్రాన్‌లో నిర్మించేందుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి రెండు మండళ్లను నియమించినట్టు ఆమె తెలిపారు. వివిధ రంగాల నిపుణుల సూచనలు, సలహాలను ఈ మండళ్లు విశ్లేషిస్తాయని చెప్పారు. అయితే రాజధాని మార్పు వెంటనే జరగదని ఆమె వెల్లడించారు. రాజధానిని మార్చడానికి భారీ ఆర్థిక వ్యయం, రవాణా సమస్యలు ఏర్పడతాయని విమర్శకులు తెలిపారు.

ఎండల్లో 2024 రికార్డు

న్యూఢిల్లీ: చరిత్రలో అత్యంత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన ఏడాదిగా 2024 రికార్డులకు ఎక్కినట్లు ఐరోపా వాతావరణ సంస్థ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ శుక్రవారం వెల్లడించింది. అంతర్జాతీయ వాతావరణాన్ని నమోదు చేయడం 1850లో ప్రారంభమైందని, అప్పటి నుంచి అత్యంత ఎక్కువ వేడి వాతావరణం గత ఏడాదే నమోదైనట్టు తెలిపింది. మనుషులు శిలాజ ఇంధనాలు కాల్చడం ప్రారంభించడానికి ముందు(పూర్వ పారిశ్రామిక దశ) కాలమైన 1850-1900 సగటును పరిగణనలోకి తీసుకుంటే 2024 వార్షిక ఉష్ణోగ్రత సగటులో 1.60 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యిందని ప్రకటించింది. ఒక క్యాలెండర్ ఏడాది సగటులో పారిశ్రామిక పూర్వ స్థాయిల కంటే 1.5 డిగ్రీల ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదు కావడం ఇదే మొదటిసారి అని తెలిపింది. 2024లో జనవరి నుంచి జూన్ వరకు అన్ని నెలలూ గతంలో ఆయా నెలల్లో నమోదైన ఉష్ణోగ్రతల రికార్డులను బ్రేక్ చేశాయని ఈ సంస్థ వెల్లడించింది.

కార్తి చిదంబరంపై మరో సీబీఐ కేసు

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం తనయుడు కార్తి చిదంబరంపై మరో అవినీతి కేసును సీబీఐ నమోదు చేసింది. డియాజియో స్కాట్‌లాండ్ కంపెనీ ఇంపోర్టెడ్ డ్యూటీ ఫ్రీ జానీ వాకర్ విస్కీని అమ్మడంపై నిషేధం నుంచి కార్తి ఉపశమనం కల్పించారని సీబీఐ ఆరోపించింది. కార్తి, ఆయన సన్నిహితుడు ఎస్ భాస్కర రామన్ నియంత్రణలో ఉన్న అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డియాజియో స్కాట్‌లాండ్, సెక్వోయియా క్యాపిటల్స్ కంపెనీల నుంచి అనుమానాస్పదంగా 15 వేల డాలర్ల చెల్లింపులు జరిగినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్ ఆరోపించింది. ఇంపోర్టెడ్ డ్యూటీ ఫ్రీ ఉత్పత్తులను భారత దేశంలో అమ్మడంపై ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు